కల నెరవేరేనా వ్యథ తీరేనా..!


చీమకుర్తి వద్ద రద్దీగా ఉన్న ఒంగోలు-కర్నూలు రోడ్డు


చీమలమర్రి వద్ద రద్దీగా ఉన్న ఒంగోలు-కర్నూలు రోడ్డు

- హామీలకే పరిమితమైన ఒంగోలు-కర్నూలు రోడ్డు విస్తరణ
- పట్టించుకోని కూటమి నేతలు
- ప్రమాదాలకు నెలవుగా మారుతున్న వైనం
- బెంబేలెత్తుతున్న ప్రయాణికులు, వాహనదారులు

చీమకుర్తి రూరల్: నిత్యం వేలాది వాహనాలతో ఆ రోడ్డు బిజీబిజీగా ఉంటుంది. ఆ రోడ్డులో వెళ్లాలంటే నిత్యం నరకమే. 10 నిమిషాల ప్రయాణానికి అరగంట సమయం పడుతుంది. చీమకుర్తి పేరు వినగానే మనకు గుర్తొచ్చేది గ్రానైట్ పరిశ్రమ. దాంతో పాటు రోడ్డు కూడా గుర్తొస్తుంది. బచీమకుర్తి మండల పరిధిలోని కొన్ని గ్రామాల్లో గ్రానైట్ క్వారీలు అనుబంధ గ్రానైట్ పరిశ్రమలు, కంకర మిల్లులు వాహనాలతో నిత్యం రద్దీగా ఉండే ఒంగోలు-కర్నూలు రోడ్డును జాతీయ రహదారిగా విస్తరణ అనేది హామీలకే పరిమితమైంది. బూదవాడ నుంచి చీమకుర్తి వరకు ప్రయాణించాలంటే అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ధ్వంసమైన రోడ్డులో దుమ్ము, ధూళి, కుదుపులతో ప్రయాణం ఒక నరకంలాంటిది.

ప్రమాదాలకు నెలవు..

ప్రధానంగా చీమకుర్తి ప్రాంతంలో విస్తరించి ఉన్న గ్రానైట్ అనుబంధ పరిశ్రమల వద్దకు వేలాదిగా టిప్పర్‌లు, భారీ వాహనాలు, రామాయపట్నం పోర్టు నిర్మాణ పనుల నిమిత్తం రాళ్లతో వెళ్తుంటాయి. అందువలన ఈ రహదారి ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. ఈ రహదారి కేవలం రెండు వరుసలు మాత్రమే ఉండటం వలన ఒంగోలు పొదిలి-బేస్తవారిపేట మధ్య నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. ఒంగోలు నుంచి బేస్తవారిపేట కూడలి వరకు ఉన్న కర్నూలు రోడ్డును విస్తరణ చేయకపోవడదం వలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్రానైట్ రాళ్లతో వెళ్తున్న లారీలను చూస్తుంటే భయం వేస్తుంది. ఎక్కడ మీద పడతాయోమోనని వాహనదారులు భయాందోళనకు గురవతున్నారు. ముందు గ్రానైట్ లారీలు వెళ్తుంటే చాలు భయంభయంగా వాహనాలు దాటాల్సి వస్తోందని ప్రయాణికులు, వాహనదారులు వాపోతున్నారు.

మాటలకే పరిమితమైన నేతల మాటలు..

ఒంగోలు-కర్నూలు రోడ్డును జాతీయ రహదారిగా విస్తరణ చేస్తాం.. అదిగో అప్పుడు, ఇప్పుడు అంటున్నారేగాని పట్టించుకున్న పాపానాపోలేదు. రోడ్డు విస్తరణ దిశగా అడుగులు ముందుకు పడటం లేదు. పశ్చిమ ప్రకాశంలో వాహనాల తాకిడి తక్కువగా ఉన్న రోడ్లు కూడా విస్తరణ చెందుతుండగా, ఎంతో ప్రాముఖ్యమైన ఒంగోలు-కర్నూలు రోడ్డును కూటమి ప్రభుత్వం విస్మరించడంతో ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ఒంగోలు-చీమకుర్తి రోడ్డును విస్తరించి ప్రయాణికులు, వాహనదారుల ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

జాతీయ రహదారిగా మార్చాలి..



ఒంగోలు-కర్నూలు రోడ్డును జాతీయ రహదారిగా విస్తరణ ఆవశ్యకత ఎంతైనా ఉంది. వాహనాల రద్దీ అధికంగా ఉన్న ఈ రోడ్డులో ప్రతిరోజు ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అందువలన ఈ రోడ్డును త్వరగా జాతీయ రహదారిగా విస్తరణ చేయాలి.

– అశోక్‌బాబు అత్యాల, చీమలమర్రి

త్వరగా రోడ్డు విస్తరణ చేయాలి..



ఒంగోలు-కర్నూలు రోడ్డును వీలైనంత త్వరగా విస్తరణ చేయాలి. చీమకుర్తి గ్రానైట్ గనుల నుంచి పరిశ్రమల నుంచి భారీ వాహనాలు అధిక సంఖ్యలో తిరుగుతుంటాయి. ఈ క్రమంలో రద్దీ సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు విస్తరణ చేస్తే ప్రమాదాలు తగ్గుతాయి.

– మాగులూరి ఇమ్మానియేలు, చీమలమర్రి

క్లుప్తంగా

6వ తరగతితో అడ్మిషన్లకు ప్రవేశ పరీక్ష

నాగులుప్పలపాడు: మండలంలోని అమ్మనబ్రోలు గురకుల బాలికల పాఠశాలలో ఈ ఏడాదికిగాను 6వ తరగతిలో మిగిలిన సీట్లు పూర్తి చేయడానికి ఈ నెల అర్హతగల అభ్యర్థుల నుంచి 16వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ మాధవి తెలిపారు. అర్హతగల అభ్యర్థులు ఈ నెల 14వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు పాఠశాలలో సంప్రందించాలని తెలిపారు. వివరాలకు 87126 25043 నంబరును సంప్రందించాలని తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన


మాట్లాడుతున్న లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజరు రమేష్

ఒంగోలు సిటీ: అపరిచిత వ్యక్తుల ఫోన్‌లకు గురైన ఖాతాలు అక్రమ నిధుల మూలాల్ని గుర్తించడం కష్టతరం చేస్తాయని లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రమేష్ అన్నారు. శనివారం కెనరా బ్యాంక్ రీజినల్ మేనేజర్ భీమా రాఘవేందర్ ఆధ్వర్యంలో ఒంగోలు కెనరా బాంక్ ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని శాఖల్లో ఆగస్టు 7, 8వ తేదీల్లో మనీ మ్యూల్ అకౌంట్ నివారణ గురించి, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ మనీ మ్యూల్ ఖాతా అనేది నేరస్తుల మోసాలు, చట్టవిరుద్ధ కార్యకలాపాల నుంచి పొందిన డబ్బును స్వీకరించడానికి, బదిలీ చేయడానికి లేదా లాండరింగ్ చేయడానికి ఉపయోగించే ఖాతా అన్నారు. ఖాతాదారుడికి తెలియకుండానే ఈ మోసాల జరగే అవకాశం ఉందన్నారు. మీ దగ్గర ఉన్న ఏటీఎం కార్డులు ఎవరికి ఇవ్వకూడదన్నారు. ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో రూడ్ సెట్ ఫ్యాకల్టీ బాపూజీ, కెనరా బ్యాంక్ రీజినల్ ఆఫీస్ డివిజనల్ మేనేజర్ లీలా ప్రతాప్, మేనేజర్ లింగం జోయస్ కీర్తి, ఇతర శాఖల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ వార్డు సభ్యురాలు మృతి


నివాళులర్పిస్తున్న కౌన్సిలర్ గంగయ్య, నాయకులు

చీమకుర్తి రూరల్: పట్టణంలోని క్రిస్టియన్ పాలెం చీమకుర్తి మేజర్ పంచాయతీ మాజీ వార్డు సభ్యురాలు పెద్ద కమలమ్మ శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆమె మృతదేహాన్ని స్థానిక వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, చీరాల సుబ్బారావు, జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పేరం శ్రీనివాసరావు, ప్రజా కవి పిన్నిక శ్రీనివాసరావు, అల్లరి రవి, పాటిబండ్ల పెద్ద బాబురావు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

14న అనాథ వృద్ధాశ్రమం ప్రారంభం


మాట్లాడుతున్న అనాథ వృద్ధాశ్రమ సభ్యులు

చీమకుర్తి రూరల్: దాతల సాయంతో చీమకుర్తి పట్టణంలో ఈనెల 14వ తేదీ గురువారం అనాథ వృద్ధాశ్రమం ప్రారంభించనున్నట్లు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఎస్కే ఖాదర్ బాషా తెలిపారు. 60 ఏళ్ల దాటిన వృద్ధులు మా ఆశ్రమంలో చేర్చుకుంటామని, 30 బెడ్లు ఐదుగురు సిబ్బందితో దాతల సహకారంతో ఈ ఆశ్రమం నడుపుతున్నామన్నారు. కార్యక్రమానికి అందరూ రావాల్సిందిగా ఆహ్వానిస్తున్నామని చెప్పారు. వైస్‌చైర్మన్ ఎస్ కె.నూర్ మహమ్మద్, జనరల్ సెక్రెటరీ షేక్ రజియా, డైరెక్టర్ ఈనగంటి సుబ్బారెడ్డి, డైరెక్టర్ గోనుగుంట మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

239 పొగాకు బేళ్లు తిరస్కరణ



కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో 239 బేళ్ల తిరస్కరణకు గురైనట్లు ఇన్‌చార్జి వేలం నిర్వహణాధికారి ఎం.సత్య శ్రీనివాస్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని పైడిపాడు, గోగినేనివారిపాలెం, అక్కచెరువుపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1069 బేళ్లను వేలానికి తీసుకురాగా 830 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.281, కనిష్ట ధర రూ.140, సరాసరి ధర రూ.217.67గా నమోదైంది. వేలంలో 25 కంపెనీలు పాల్గొన్నాయి.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో 258 బేళ్ల తిరస్కరణకు గురైనట్లు వేలం నిర్వహణ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. క్లస్టర్ పరిధిలోని చిరికూరపాడు, పీపీపాలెం గ్రామాలకు చెందిన రైతులు 926 బేళ్లను తీసుకురాగా 668 బేళ్లను కొనుగోలు చేశారు. గరిష్ట ధర రూ.281, కనిష్ట ధర రూ.150, సరాసరి ధర రూ.229.84గా నమోదైంది. వేలంలో 19 కంపెనీలు పాల్గొన్నాయి.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు


చుండూరి రవిబాబుకు రాఖీ కడుతున్న మహిళా నాయకులు

ఒంగోలు సిటీ: అక్కతమ్ముడు, అన్నాచెల్లెళ్ల బంధాలకు ప్రతీకైన రక్షాబంధన్ వేడుకలు వైఎస్సార్ సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. శనివారం వేడుకలను శనివారం మహిళా నాయకులు ఘనంగా నిర్వహించారు. ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డిలకు మహిళా నాయకులు రాఖీలు కట్టి, హారతులు ఇచ్చి అభినందనలు తెలిపారు, అనంతరం స్వీట్లు అందించారు. కార్యక్రమంలో మహిళా నాయకులు మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి భూమిరెడ్డి రమణమ్మ, మహిళా నాయకులు సయ్యద్ అఫ్సర్, పేరం ప్రసన్న, మేరీకుమారి, వాణి, లక్ష్మీకాంతం, రమణమ్మ, గోవిందమ్మ, తదితరులు పాల్గొన్నారు.


బత్తుల బ్రహ్మానందరెడ్డికి రాఖీ కడుతున్న మహిళలు

ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

సంతనూతలపాడు(చీమకుర్తి రూరల్): మండలంలోని పేర్నమిట్టలోని చెన్నకేశవ, రంగనాథ స్వాముల ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం నిర్వహించారు. చెన్నకేశవ, రంగనాథ స్వాముల ఆలయ చైర్మన్‌గా శిరిపురపు రుద్రయ్య, కమిటీ పాలకవర్గ సభ్యులచే శనివారం ఆలయంలో ఒంగోలు డివిజన్ ఎండోమెంట్ ఇన్స్‌పెక్టర్ సీహెచ్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఏ ప్రసన్న లక్ష్మిలు ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ చైర్మన్‌గా ఎస్.రుద్రయ్య, పాలకవర్గ సభ్యులుగా జీ నారాయణ, ఏ. వెంకటేశ్వర్లు, పి.శ్రీనివాస్ పవన్, పి. మమత, ఆర్.సుధారాణి, జి. సుజాత, డి. కృష్ణవేణిలు ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ అర్చకులు ఎక్స్ అఫీషియల్ మెంబర్‌గా పరాంకుశం రామకృష్ణమాచార్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

ఏపీటీఎఫ్ మండల నూతన కమిటీ ఎంపిక


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ

నాగులుప్పలపాడు: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ మండల నూతన కమిటీని శనివారం ఎంపిక చేసినట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో పలు అంశాలపై చర్చించిన అనంతరం నూతనంగా మండల కమిటీని ఎంపిక చేసినట్లు తెలిపారు. మండల అధ్యక్షుడిగా టీ ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శిగా షేక్ మౌలాలి, ఉపాధ్యక్షులుగా ప్రసాద్, వెంకటేశ్వర్లు, విజయలక్ష్మితో పాటు సభ్యులుగా మరో ఆరుగురిని ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరందరూ ప్రమాణం చేశారు.

చదువుల్లో గిరిజన విద్యార్థులు ముందుండాలి

- ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం


విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న నాయకులు

చీమకుర్తి రూరల్: చదువుల్లో గిరిజన విద్యార్థులు ముందుండాలని వక్తలు పేర్కొన్నారు. శనివారం చీమకుర్తి పట్టణంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏకలవ్య సేవా సమితి ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షుడిగా ఏకలవ్య సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పేరం శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ ఏఎంసీ చైర్మన్ మారం వెంకారెడ్డి, వైద్యుడు చీమకుర్తి లైన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు బీ జవహర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా జవహర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందించిన వసతులు ఉపయోగించుకొని విద్య ద్వారా ఉన్నత స్థానాలకు ఎదిగి ఆదివాసి ప్రాంతంలో వెలుగు తీసుకొని రావాలని ఆకాంక్షించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ అందించిన రిజర్వేషన్లు ఉపయోగించుకొని గిరిజనుల ప్రజలు అభివృద్ధి చెందాలంటే చదువు ఒకటే మార్గం అని అన్నారు. ఈ సందర్భంగా గతేడాది పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు పేరం శ్రీనివాసరావు, నాగలక్ష్మి దంపతులు రూ. 10 వేల నగదు అందజేశారు. ముందుగా ఆదివాసి పోరాటాల అమరవీరులను స్మరించుకున్నారు. గురుకుల పాఠశాల ఆఫీసుకు బీరువాను పెద్దల చేతుల మీదుగా బహూకరించారు. ప్రస్తుతం 9వ తరగతి, 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చీమకుర్తి మండల జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, చీమకుర్తి మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కందిమళ్ల గంగాధర్‌రావు, బొంతా దాసు, పిన్నిక శ్రీనివాసరావు, చీమకుర్తి లయన్ క్లబ్ మాజీ ప్రధాన కార్యదర్శి చలవాది రమేష్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు బత్తుల మల్లికార్జునరావు, మాజీ కౌన్సిలర్ కోటా రాములు, ఇస్తర్ల శంకర్, చింతలపాలెం యలమంద బాబు, ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

హనుమంతునిపాడు: మండల కేంద్రంలోని గంగమ్మ గుడిలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం నిర్మించి ఏడాది పూర్తి అయిన సందర్భంగా సంవత్సర వేడుకలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. తిమ్మారెడ్డిపల్లి పంచాయతీ కిచ్చంపల్లి వద్ద వెలసిన నిదానంపాటి అమ్మవారికి శనివారం ప్రత్యేక కొలుపులు పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో వచ్చిన భక్తులు నిదానంపాటి అమ్మకొలుపులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

పలువురికి ఎమ్మెల్యే బూచేపల్లి పరామర్శ


ఆంజనేయరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి


ధర్మేంద్ర రిపోర్టులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

తాళ్లూరు: మండలంలో పలు గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శనివారం పరామర్శించారు. కొర్రపాటివారిపాలెంలో ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు సంగం ధర్మేంద్రను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. రమణాలవారిపాలెంలో కోటిరెడ్డి తల్లి సుబ్బులు పక్షవాతంతో ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకుని ఆమెను పరామర్శించారు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని, ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోశం మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, సర్పంచ్‌లు కోట శివలక్ష్మి వెంకట రామిరెడ్డి, షేక్ వలి, మాజీ ఎంపీపీ గోళ్లపాటి మోషే, ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రెడ్డి, మండల అనుబంధ విభాగం అధ్యక్షుడు కొర్రపాటి విష్ణు, కైపు అశోక్‌రెడ్డి, గువ్వల శ్రీనివాసరెడ్డి, నారాయణ శెట్టయ్య, మాజీ జెడ్పీటీసీ లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మండల నాయకులు ఐవీ సుబ్బారెడ్డి, యత్తపు మధుసూదన్‌రెడ్డి, పూనూరి దేవదానం, కటకంశెట్టి శ్రీనివాసరావు, గోపు శ్రీను, కొర్రపాటి భరత్, గూడా గోపాల్‌రెడ్డి, ఎర్రయ్య, షేక్ మస్తాన్వలి, షేక్ రఫీ, సుబ్బారావు, సంగు కొండారెడ్డి, ఓబుల్‌రెడ్డి, కైపు కోటిరెడ్డి ఉన్నారు.

దొనకొండ: మండలంలోని గంగదేవిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ కర్నాటి ఆంజనేయరెడ్డికి ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు విరగటంతో ఆయన్ను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శనివారం ఆయన గృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆంజనేయరెడ్డి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బూచేపల్లి వెంట మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, ఎంపీపీ బోరిగొర్ల ఉషామురళి, జిల్లా యాక్టివిటీ సభ్యులు బత్తుల వెంకట సుబ్బయ్య యాదవ్, ఎంపీటీసీ కసిబిసి నాగరాజు, సర్పంచ్ ఐలూరి శ్రీనివాసరెడ్డి, మోడి బాలయ్య, గుడిమెట్ల విజయ్, శివారెడ్డి, వెర్రి ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వనభోజనాలు


కలిసి వంట చేసుకుంటున్న భక్తులు

కురిచేడు: శ్రావణ పౌర్ణమి సందర్భంగా మండలంలోని వెంగాయపాలెంలో మహిళలు శనివారం వనభోజనాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని మహిళలు ఉదయాన్నే గ్రామ శివారులోని ఉసిరిక చెట్టు వద్దకు వెళ్లి ముందుగా వనదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వంట చేసుకుని సహపంక్తి భోజనం చేశారు.


వన దేవతకు పూజ చేస్తున్న మహిళలు

వైభవంగా ప్రతిష్ఠ మహోత్సవం

మద్దిపూడి: మండలంలోని కూచిపూడి గ్రామ శివారులో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ దేవస్థానంలో విగ్రహాప్రతిష్టా మహోత్సం శనివారం అంగరంగా వైభవంగా సాగింది. మూడు రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాల్లో భక్తులు వేల సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అలయ అర్చకులు వై వెంకట రమణ అమ్మవారిని పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆగమపండితులు, ప్రతాష్టాచార్యులు గూడలి వెంకటకృష్ణ చైతన్యశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విఘ్వేశ్వరపూజ, పున్యాహవచనం, దాతున్యాసం, శిఖర, యంత్ర, బింబి, ప్రాణప్రతిష్టా, కుంభాభిశేఖం, పూర్ణాహుతి, ఆలయ మహానివేదన, దీక్షావిరమణ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

వృద్ధులకు అన్నదానం

మార్కాపురం టౌన్: అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ఒంగోలు రోడ్డులోని లింగారెడ్డి కాలనీలో వృద్ధులకు అన్నదానం హైకోర్టు న్యాయవాది, కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వరరావు, అభయ ఫౌండేషన్ నిర్వాహకురాలు డాక్టర్ అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మహిళలకు చట్టాలు, హక్కులపై అవగాహన కల్పిస్తామన్నారు. వృద్ధులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల లెక్చరర్లు కుమార్, అనీల్ పాల్గొన్నారు.

చిల్లచెట్లు తొలగించాలని గ్రామస్తుల ఆందోళన


చిల్లచెట్లు తొలలించాలని డిమాండ్ చేస్తున్న గ్రామస్తులు

కొత్తపట్నం: మంచినీటి చెరువు కట్టపై చిల్లచెట్లు తొలగించాలని సంకువారి గుంట గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం గ్రామస్తులు సంకువారిగుంట పరిధిలో ఉన్న మంచి నీటి చెరువు దగ్గరకు వెళ్లి పరిస్థితిని వివరించారు. కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు దుగ్గిరాల విజయకుమార్ మాట్లాడుతూ.. మంచినీటి చెరువు దగ్గరకు వెళ్లాలంటే చిల్లచెట్లతో మూసుకుపోయి భయంకరంగా ఉందన్నారు. ఎన్ఆర్‌జీఎస్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని, చిల్లచెట్లు పెరగడం వలన చెత్త సంపద తయారీ కేంద్రానికి వెళ్లే అవకాశం లేదన్నారు. చెరువులో నాచు పెరిగి దుర్వాస వస్తున్నాయని తెలిపారు. అవి పశువులు తాగి అనారోగ్యానికి గురై కొన్ని చనిపోయాయని వివరించారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని చెరువును శుభ్రం చేసి చిల్లచెట్లు తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సుదర్శి గాంధీ, డీఎస్ఎఫ్ దళిత విద్యార్థి నాయకులు స్వర్ణ రవి, వివేక్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.